

**- కె. కె. మీనన్**

అర్ధరాత్రి.

ఆకస్మికంగా మెలుకువ వచ్చింది రామ్మూర్తికి. ఒళ్ళంతా తడిగా, వెచ్చగా తగిలి ఒళ్ళంతా చికాగ్గా ఉంది. గదంతా చీకటి. బయటి వెన్నెల అనధికారికంగా లోపల ప్రవేశించి నీళ్ళలో పాలలా చీకటిని పలచపరుస్తూంది. ఆ గదిలోకి గాలి ప్రవేశించే మార్గాలు కిటికీ, తలుపు— రెండూ తెరిచే ఉన్నాయి. అయినా, ఆ గది గాలిని వెలివేసింది. పగలంతా కాలి, గాలిని కాల్చి, తేలికచేసి బయటికి నెట్టేసి ఆ గది నో కమ్మరి కొలిమిలా మార్చేసే ఆ ఇంటి రేకుల కప్పు ఇంకా చల్లార లేదు.

అసహనంగా అటూ ఇటూ దొర్లాడు రామ్మూర్తి. ఏమిటో వెధవ ఒంటెద్దు బతుకు? ఇంతవరకూ ఉద్యోగం లేదని బాధపడ్డాడు. అదేదో వచ్చింది. ఆ ఉద్యోగం తనకి అన్ని సుఖాలనీ ఇవ్వలేక పోయినా, ఏదో రెండు పూటలా తిని ఈ రేకుల షెడ్డులో తల దాచుకోవ టానికైనా సాయపడుతూంది. అను కోవడమేగాని అంతకంటె పెద్ద ఉద్యోగం తన కెక్కణ్ణుంచి వస్తుంది?! వచ్చే అవకాశమే ఉంటే పార్వతి తన్నలా దగాచేసి పోయేదా? ఛ! ఆమె నెందుకు తప్పు పట్టటం? అసలా ప్రసక్తే రాలేదు గదా? ఒక వేళ వచ్చినా, 'నీ స్టేటస్‌తో నాకు పనిలేదు, రాముూ, ఊడిగిం చేసి అయినా నీకు సాయపడతాను' అని తక్కువ చెప్పేసి ఉండేది. అందులో ఏమాత్రం సందేహం లేదు. ఆలోచిస్తే తనే ఆమెను దగా చేశాడేమో? పార్వతి తలపులు దాగానే అతని బుర్ర పాత తలుపుల పాలైపోయింది.

'స్త్రీ ఒకసారి ప్రేమించిందంటే ఇక చచ్చిందన్నమాటే!' అంటాడు

## నవ్వే నువ్వు

నవ్వుతున్న పువ్వులను చూస్తున్నాను
నీ నవ్వే తలపోస్తున్నాను.
ఈ పువ్వులు నీ నవ్వే
నవ్వడం నేర్చుకున్నాయేమో!
అని భ్రమలో పడ్డాను.
నవ్వుతున్న ప్రతి పువ్వులో
నవ్వే నువ్వే నిండి ఉన్నావు.
నవ్వే ఈ పువ్వులు
నవ్వది ఒక పిచ్చే!
నీ నవ్వు మాత్రం
నిత్యనూతనమైనది.
నవ్వుతున్న నిన్ను చూస్తూ
ఆశ్చర్యంలో మునిగిపోతాను.
నవ్వేది నీ పెదవులా?
నవ్వేది నీ కన్నులా?
కాంతి నిండిన కన్నులతో పోటీ చేసింది పెదవులా?
తేనెలూరు పెదవులతో జత కలిపింది కన్నులా?
ఎంత ఆలోచించినా జవాబు దొరకదు
ఎంతసేపు చూసినా నీ నవ్వు అర్థం చెప్పదు.
పెదవులతో కన్నులు
కళ్ళతో పెదవులు
కలిసి నవ్వుతాయి
కాంతిని వెదజల్లుతాయి.
అందుకేనేమో నీ నవ్వు
అంత అందమైనది!

☆

— విజయలక్ష్మి

---

శరత్. అంటే, స్త్రీ ఒకే ఒక వ్యక్తిని ప్రేమిస్తుంది. అతన్ని పొందలేకపోతే అలా చచ్చయినా పోతుందిగాని, మరొకరికి మనసివ్వదు అని ఆయన భావం కాబోలు! అయితే, పార్వతి తన్ను ప్రేమించలేదన్న మాటేగా? అసంభవం! ప్రేమించకపోతే, తల్లిదండ్రుల్ని కాదని ఇల్లు వదిలి తన కోసం ఎందుకు పరుగెత్తుకొస్తుంది? మరి ప్రేమిస్తే మరొకరికి మనసెలా ఇవ్వగలిగింది? అయితే, శరత్ పొరబడ్డారా? పొరబడకపోవచ్చు. శరత్ చెప్పిన ప్రతిది సిద్ధాంతం కానక్కరలేదు. న్యూటన్ మూడు సూత్రాల్లా అది ప్రపంచాన్ని పరిపాలించాల్సిన పని లేదు. అలాగని అది ఫెయిల్ అయిందని భావించ నక్కర్లేదు. అనుభవైక వేద్యమైన అనేక విషయాలను అలానే చెప్పారాయన. అన్ని అన్ని కాలాల్లోనూ అందరిపట్లా అన్వయం కాకపోవచ్చు. తనపట్ల కూడా అంతే అయింది. మనిషి అసంగతంగా పలికిన ఒక పలుకు అతని జీవిత గమనాన్నే మార్చేస్తుందనేందుకు ఇంత కంటె మంచి దృష్టాంతం మరొకటి లేదు.

అప్పటికి ఇంకా తనకీ ఉద్యోగం రాలేదు. ఉండీలేని చిక్కులు పడుతున్న రోజులు. అలాంటి పరిస్థితుల్లో ఒక రోజు ఆకస్మికంగా ఊడిపడ్డట్టు వచ్చి, పెళ్ళి చేసుకొమ్మని అడిగింది పార్వతి. ఆమెను వదులుకోలేక, చేపట్టే తెగువూ ధైర్యమూ లేని తికమకలో అసంకల్పితంగానే అనేశాడు—

"పొరబాటు చేశావేమో, పార్వతీ" అని.

ఆ మాట విన్నాక పార్వతి నివ్వెరపోయింది. అలా తన ముఖం లోకి చూస్తూనే చాలాసేపు ఉండిపోయింది.

ఆ తరవాత — "నేను పొరపాటు చేశానని నువ్వు మనస్ఫూర్తిగా అనుకుంటున్నావా, రామూ" అనడిగింది.

"నేను అనుకున్నా అనుకోక పోయినా..."

"నా కవన్నీ అనవసరం. ఎవరికోసమో నేను భయపడను. నీ విషయం చెప్పు. నేను పొరబాటు చేశానని అంటావా?"

"ఇంట్లో చెప్పకుండా రావటం ..."

"ఇహ చాలు. వెళుతున్నాను."

చిటుక్కున లేచి ప్రయాణమైంది. తన ప్రయత్నాలేమీ ఆమెను ఆపలేక పోయినాయి.

పార్వతి ఊహల నుంచి మనస్సు మరల్చుకుందామని అనుకుంటున్నప్పుడే బయటి నుంచి హృదయ విదారకంగా ఏడ్పులు వినిపించాయి. లేచి వచ్చి బయట నిలబడ్డాడు. పక్క వాళ్ళింట్లో ఎవరో పోయినట్టున్నారు. ఏడ్పులూ, ఓదార్పులూ వినిపిస్తున్నాయి. కాస్సేపటికి తప్పెట్ల తాళాలతో భజనలు ప్రారంభమైనాయి.

మనిషి పోయాక మళ్ళీ పుడతా డనేది మన వాళ్ళ విశ్వాసం. మనకే కాదు, ప్రతి ప్రాచీన మతంలోనూ ఈ విశ్వాసం ఉంది. మృత్యువు కవతల మరో జీవితం ఉందన్నది కూడా ఒక సిద్ధాంతం. ఈ జీవితంలో కష్టపడ్డాడు గనక మరో మంచి జీవితాన్ని ప్రసాదించమనా? స్వర్గం పొందాలనా? లేక తుచ్ఛమైన ఈ మానవ జన్మ మరి ఉండకూడదనా? దేనికోసం ఈ భజనలూ, దైవ ప్రార్థనలూను?

తల్లి స్తన్యం కుడుపుతున్నప్పుడు బిడ్డ హాయిగా తాగుతుంది. అది కాగానే మరో స్తనానికి మరల్చటానికి తల్లి చేసే ప్రయత్నం బిడ్డకు దుఃఖభాజన మవుతుంది. తను మళ్ళీ తాగబోతున్నాననే జ్ఞానం బిడ్డకు ఉండదు. కుయ్యో మొర్రో అంటాడు. కాని, తియ్యటి ధార పెదాలపై మళ్ళీ సోకగానే అంతా విస్మరించి హాయిగా తాగుతాడు. ఇలాంటిదే మానవ జీవితం కూడానని టాగూర్ అభిప్రాయం. మొదటి స్తన్యం నుంచి విడదీస్తున్నప్పటి బిడ్డ స్థితి కాబోలు మరణానిది. ఇన్ని విశ్వాసాలున్న మనవాళ్ళు మనిషి ప్రాణం పోతే ఎందుకు ఏడవటం?

చావు ఎంత భయంకరమైందో తనకు తెలియదు. తెలిసిందల్లా ఆ చావుని గూర్చిన ఏడ్పులూ, వాటి వెనక విషాదమూ మాత్రం భయంకరమైనవని. ఆ శోకాలు విన్నప్పుడు ఆ విన్నవాడి మానసిక స్థితినిబట్టి వ్యక్తిగతమైన బాధలూ, వ్యధలూ పెల్లుబికి పాత గాయాలన్నిటిని కెలికి తూట్లు పొడుస్తాయి.

అమ్మ తన చిన్నతనంనుంచీ గుండె జబ్బుతో బాధపడుతూ ఉండేది. ఏ క్షణాన్నయినా ఆమె చనిపోవచ్చని అందరూ అంటూండేవారు. ఆమె బ్రతికే ఉంది. కాని, ఆమెకు జీవితమంతా సపర్యలుచేసి, తన కొద్దిపాటి ఆర్జనతోనే పిల్లల చదువులూ, సంసారం చిరునవ్వుతో నెట్టుకొచ్చిన నాన్నమాత్రం ఒక రోజు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి, మందు ముట్టే అవకాశం కూడా లేకుండా వెళ్ళిపోయారు. అందరి ఓదార్పుల ప్రకారం ఆయన ధన్యజీవి! కాని, జీవితంలో ఆయనేం చూశారు? ఏం అనుభవించారు? తన శక్తినంతా సంసారంకోసం వెచ్చించి ఏమీ పొందకుండా వెళ్ళిపోయారు. అదే తన బాధ. ఎక్కడ ఏడ్పులు విన్నా, ఆ బాధే పెలవేస్తూ ఉంటుంది. కాని, ఆ పోయినటి వాడి కోసం ఎందు కేడవాలి? అతనికేంతక్కువ? అతను పొందని దేం ఉంది? ఒక వేళ పొందక పోయినా, పోయిన తర్వాతయినా పొందగల శ్రీమంతు డాయన. అలాంటి వాడు చస్తే ఏడవటం ఎందుకో? ఎందు కేమిటి? అది మానవనైజం. దానికి తర తమ భేదా లుండవు. మనిషితో ఆపేక్షా, ఆత్మీయతా ఉన్నంతవరకూ, రక్త స్పర్శ హృదయ తంత్రుల్ని తడుతున్నంతవరకూ అది అనివార్యం.

ఆ వాతావరణంలో తనింక నిద్ర పోవటం అసంభవం. తాళం పెట్టి రోడ్డుమీద పడ్డాడు. వెన్నెల పిండార బోసినట్టుంది. మ్యునిసిపాలిటీ వాళ్ళు తెలివి వికసించినట్టుంది. లైట్లన్నీ ఆర్పేశారు. లేకుంటే వెన్నెల సౌరభాన్నంతా మింగేస్తూ లైట్లన్నీ వెలుగుతూనే ఉంటాయి. ఒక్కోసారి అమావాస్య చీకట్లో కూడా లైట్లుండవు.

ఫుట్ పాత్ వెంబడే నడుస్తున్నాడు. నగరం అంతా నడిరోడ్డుమీదే నిద్దరోతున్నట్టు ఎక్కడా నడవటానికి వీల్లే నంతగా జనం సుఖ నిద్రలో ఉన్నారు. ఇరవై ఏడేళ్ళ స్వతంత్ర భారత ప్రగతిలో సామాన్యుడికి సంక్రమించిన వాటా ఇది. ఎండలో ఎండటం, వానకి ఏ మూసిన షాపు షట్టర్ నీడనో తలదాచుకుంటూ బ్రతుకు వెళ్ళబుచ్చటం.

ఆలోచించుకుంటూ ముందుకు పోతున్నాడు. దారి పొడుగునా నగ్నంగానూ, అర్ధనగ్నంగానూ నిద్దరోతున్న వీధి పౌరుల్ని చూసి కించిత్తు ఈర్ష్య కూడా కలిగింది. ఏ చీకూ చింతా లేకుండా హాయిగా నిద్దరోతున్నారు. మరి తనో? నాగరకత వంగివేషాలకి లొంగి పోయి, గాలి చొరని ఆ రేకుల షెడ్డులో నిద్ర పట్టని ఆలోచనలతో సతమత మవుతూ రేయంతా నెట్టాలి. పైగా తనేదో వాళ్ళకంటె గొప్పవాణ్ణని ఆత్మ వంచన.

దూరంనుంచి జనరల్ పోస్టాఫీసు నియాన్ బోర్డు కనిపించింది. పోయి కాస్సేపు టెలిగ్రాఫ్ ఆఫీసులో కూర్చోవా లనుకున్నాడు. రాజా నైట్ డ్యూటీలో

ఉంటే కబుర్లు చెప్పుకుంటూ గడిపేయ వచ్చు.

కౌంటర్లో రాజా లేడు. డే డ్యూటీ చేశాట్ట. మరో అతను కౌంటర్లో పని చూసుకుంటున్నాడు. అక్కడ కుర్చీలో కూర్చున్నాడు. అప్పటికే అక్కడ ఇద్దరున్నారు. ఒకరు రాజకీయ వాదిలా ఉన్నాడు. అంత రాత్రి వేళ కూడా ఖద్దరు టోపీ మరిచిపోని దేశ భక్తుడు. ఏవో కాగితాలతో సతమత మవుతున్నాడు. మరొకడు తన ఈడు వాడే. ఏదో పోగొట్టుకున్న వాడిలా, ప్రపంచంలోని అన్ని దుఃఖాల్నీ అధ్య యనం చేసిన విషాద సర్వస్వంలా ఉన్నాడు.

ఖద్దరు ఆసామీ కాస్సేపు తన ముఖంలోకి చూసి, "ఈ టెలిగ్రాం కాస్త రాసి పెడతారా?" అనడిగాడు.

టెలిగ్రాం ఫారా లందుకుని అతని ముఖంలోకి చూస్తూ, అతను చెప్ప బోయే విషయంకోసం వేచి ఉన్నాడు.

"రాయండి."

"ఏదీ, మీరు చెప్పందే?"

"వసంయింది, సిద్ధంగా ఉండమని రాయండి."

వ్రాశాడు. అడ్రెస్ కూడా వ్రాసి, "ఈమాత్రానికే ఇంత రాత్రివేళ టెలిగ్రాం ఇవ్వాలా?" అన్నాడు.

"అందులో ఎంత అర్థం ఉందో నీకేం తెలుసు? అది వెంటనే తెలియ చెయ్యాల్సిన విషయం. ఫైల్ మీద సంతకం ఇప్పుడే అయింది."


"ఇప్పుడా?"

"ఏం, ఇప్పుడు కాకూడదా? ఇలాంటి విషయాలన్నీ సెటిల్ అయ్యే సమయం ఇదే" అని పళ్ళికిలించాడు.

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

పాఠకులకు,
రచయితలకు, రచయిత్రులకు,
చిత్రకారులకు, ఫోటోగ్రాఫర్లకు,
ప్రకటనదారులకు,
అభిమానులకు అందరికి
ఉగాది శుభాకాంక్షలు

మా ఖాతాదార్లకు, అభిమానులకు ఎల్లరకు మా హృదయపూర్వక ఉగాది శుభాకాంక్షలు
మంచి నాణ్యతకు, సరైన సైజుకు



అసలా సమస్య ఏమిటో, అసలది ఎందుకు సీరియస్‌గా ఉందో తొలుత అర్థంకాలేదు రామ్మూర్తికి. అందుకు కారణం అతను తలనొప్పి తోపే వేరే పోయిందని తరవాత సమర్థించు కున్నాడు.

పరిహాసంగా ప్రశ్నించిన ఆ దాని కేసు వాడి వెంటనే ముఖాన్ని గంభీరంగా మార్చుకుని, "తెల్లవారే టప్పటికే అన్నీ తెలిసిపోతాయి" అని నవ్వు బిగించాడు. డాక్టర్ జెకిల్ హైడ్‌గా మారిపోయినట్లు అనిపించింది రామ్మూర్తికి. ఆ గాంధీ ఋషిన్న చూస్తే! ఇక మాటలు పొడిగించటానికి భయపడి కాగితాలు ఇచ్చే శాడు. పెళ్ళిగాం రశీదు పుచ్చుకుని అ పెద్దమనిషి, కనీసం కృతజ్ఞత తెలుపా చెప్పకుండా బయటికి వెళ్ళిపోయాడు. బయటికి వెళ్ళి అతను బృందావన్ హోటలు లోకి పోవటమేనాగా చూసి, మళ్ళీ వచ్చి యథాస్థానంలో కూర్చున్నాడు. అక్కడి యువకుడు బల్లమీద తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. ఏంచెయ్యాలో తోచలేదు రామ్మూర్తికి. అతని దుఃఖం ఏమిటో? ఎలాంటి వేదన అతని గుండెల్ని పిండివేస్తోందో? ఎవరైనా ఆత్మీయులు మరణిస్తే పెళ్ళిగాం ఇవ్వటానికి వచ్చి పాపం కుమిలిపోతున్నాడు కాబోలు. ఎట్లా అతన్ని ఓదార్చటం?

దగ్గరికి వెళ్ళి అతని భుజాన్ని తట్టాడు. అతను తల ఎత్తి రామ్మూర్తి వైపు చూశాడు. ఏడవటం ఆపినట్లు లేదు. కన్నీళ్ళు ఆ పళ్ళని పొట్టి పెట్టుకుంటో తలదాచుకుంటున్నాయి. ముఖం ఎర్ర బడి ఉంది.

"ఏమిటి, మాస్టారూ, ఎందుకంతగా బాధపడతారు?" అనడిగాడు. ఆ యువకుడి దుఃఖం మరింతగా పెరిగింది. కన్నీళ్ళు ధారలు కట్టాయి. ఆ స్థితిలో అతన్ని అడగటం, ఆ కన్నీటి వెనకటి గాథని తవ్వాలనుకోవటం అవివేకమే! అలాగే అతని పక్కన కూర్చున్నాడు. అతను కొంచెం స్థిమిత పడ్డాక, "పేరేమిటి?" అనడిగాడు.

"సురేష్ ..." ఎలాగో సమాధానం చెప్పాడు.

"ఏమిటి, ఇంతక్రితం వివాహమైనా పోయిందా?"

లేదు."

"మరెందుకింతగా ఇదయిపోతారు? పెళ్ళిగాం ఇవ్వటానికేనా వచ్చింది."

"ఇవ్వాలనే వచ్చాను. కాని, ఇవ్వటం సిగ్గుచేటనిపిస్తోంది."

"మీ మాటలు నా కర్థం కావటం లేదు."

"అదంతా పెద్ద కథ లెండి. చెబితేగాని అర్థంకాదు."

"చెప్పండి." అన్నాడు ముఖముగా. నిజానికి కుతూహలంగా ఉంది రామ్మూర్తికి.

"మీ కెందుకో చెప్పాలనిపిస్తోంది. చెప్పి భారం దించుకుంటాను."

అతన్ని చూస్తూ కూర్చున్నాడు రామ్మూర్తి.

"అమ్మని, నాన్నని కాదని ఒక ముక్కూ మొగం తెలియని అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాను."

"అయితే ఈ దుఃఖం దేనికి?"

"ఆమె నన్ను దగాచేసి వెళ్ళిపోయింది."

ఆ యువకుడి హృదయ క్షోభ అప్పుడుగాని అర్థంకాలేదు రామ్మూర్తికి. అంతకంటె గుండెల్ని మండించి, జీవితాన్ని నుసిచేసే వ్యథ మరొకటి ఉండదనేది అతనికి అనుభవైకవేద్యమే!

"అంత ముక్కూ మొగం తెలియని అమ్మాయి నెందుకు చేసుకోవాలి?"

ఇదేం ప్రశ్న? ఇవన్నీ అతన్నెందుకు అడగాలి? అలాగని అతను ఎదురు ప్రశ్న వేస్తే ఏం చెప్పగలడు? కాని, అలాంటి ప్రమాదం తెచ్చిపెట్టకుండానే అతడు తన కథ చెప్పుకుపోసాగాడు.

"అవి నేను వరంగల్‌లో ఉద్యోగం చేస్తున్న రోజులు. ఒక రోజు హైదరాబాదు రావాలని ఖాజీపేట స్టేషన్‌కు వచ్చాను. బండి ఒక గంట ఆలస్యం అంటే ప్లాట్‌ఫారం మీద అటూ ఇటూ చక్కర్లు కొడుతూ వెయిటింగ్ రూం వైపు వెళ్ళాను. అక్కడ నలుగురు రైల్వే ఉద్యోగులు ఒక అమ్మాయిని ఊరికే అడుగుతున్నారు. ఆమె ఊరికే ఏడుస్తూ వాళ్ళని బతిమాలుతోంది. కాని, వాళ్ళు చాలా కర్కశంగా, అవినీతిగా మాట్లాడు తున్నట్లనిపించి అటు వెళ్ళాను.

'మిస్టర్! ఇక్కడ మీకేం పని? అవతలి కెళ్ళండి' అని గద్దించాడు అందులో ఒకడు.

'ఇది వెయిటింగ్ రూం. టిక్కెట్టు కొనుక్కున్న నన్ను వెళ్ళమనటానికి మీ రెవళ్ళు?' అని గదమాయించాను.

వంటు గనాడు?

చిత్రం— ఎస్. రేణుక ( ఆవడి )



అంతలో ఆమె అందుకుని, 'చూడండి, మీరు నన్ను చాలా అనుమానిస్తున్నారు' అంది.

'నోర్సెన్స్! టికెట్టు లేకుండా ప్రయాణం చెయ్యటం గౌరవంకాదేమో.'

'నిజమేనుగా! పరిస్థితులు అట్లా వచ్చాయి. అంతేగాని, మీరు అనుకుంటున్న రకం మనిషి కాదు.'

'ప్రతిదీ ఇలాగే మాట్లాడుతుంది.'

ఆమె చర్రున లేచిపోయింది.

'మీరు సరిగా మాట్లాడటం నేర్చుకోండి. నేను చేసింది నేరమే. విచారించండి. జైల్లో పెట్టండి. అంతేగాని, మీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడకండి.'

నన్ను చూసి కొంచెం ధైర్యం తెచ్చుకున్నట్లుంది. వాళ్ళని తిట్టడం మొదలెట్టింది. ఊహించని ఈ పరిణామానికి వాళ్ళు తెల్లబోయారు.

'ఆమె ఎంత కట్టాలి?'

చెప్పారు.

'ఆ డబ్బు నేను కడతాను. రిసీట్ ఇవ్వండి.'

గత్యంతరం లేక వాళ్ళు రిసీట్ రాసి ఇచ్చారు. డబ్బిచ్చి బయటికి వచ్చాను. ఆమె నా వెంటనే వచ్చింది.

'వీళ్ళు పట్టి వెధవలు. మీరు టిక్కెట్టు లేకుండా ఎందుకు ప్రయాణం చేశారు?'

'తప్పనిసరైంది.'

'పోనీలెండి. ఇప్పుడెక్కడికి వెళతారు?'

'ఎక్కడికి వెళ్ళను? దుర్మార్గులు—దించేశారు. డబ్బు గాని మళ్ళీ బండి లేదు. చూడండి, దేవుడిలా వచ్చి మీరు ఆదుకోకపోతే నే నేమైపోదునో! మీ మేలు నే నెప్పుడూ మరిచిపోను. మీకు శ్రమ కాకుంటే ఈ గాజు మీ దగ్గర ఉంచుకుని మరో ఇరవై ఇవ్వండి. ఇంటికి వెళ్ళిపోతాను.'

'మీ గాజుతో పని లేకుండగానే ఇవ్వగలను. కాని, అప్పటివరకూ ఎక్కడుంటారు?'

'ఇక్కడే ... మళ్ళీ వాళ్ళ కబంధ హస్తాల్లో పడకుండా జాగ్రత్తగా గడపాలి.'

'అది నాకు మంచిగా అనిపించటం లేదు. మీకు అభ్యంతరం లేకుంటే నా రూముకు రండి. నిర్భయంగా ఉండవచ్చు. మీ కా నమ్మకం ఉంటేనే రండి.'

'మీరెక్కడికో వెళుతున్నట్లున్నారు!'

'వెళ్ళకపోయినా ఇబ్బంది లేదు లెండి! రెండు రోజులు వరసగా సెలవు లొచ్చాయి. ఇక్కడ ఒంటరిగా గడపలేక హైదరాబాదు వెళుతున్నాను. ఫ్రెండ్స్ దగ్గరికి.'

'మీకు ఇబ్బంది కలక్కుండా ఉంటే నా కంతకంటె సురక్షితమైన చోటు కనిపించటం లేదు.'

'భలేవారే! నా కేమిటి ఇబ్బంది— మీకు అభ్యంతరం ఉండాలిగాని. అయితే, పదండి.'

ఇంటికెళ్ళాక అడిగాను—'టిక్కెట్టు లేకుండా రైలెందుకెక్కారో తెలుసుకోవచ్చా?'

ఆమె సందేహిస్తున్నట్లు కాస్సేపాగి చెప్పటం మొదలెట్టింది.

'మా పక్కింటి అబ్బాయీ, నేనూ చిన్నప్పటినించీ ప్రేమించుకున్నాం. పెళ్ళి చేసుకోవాలనుకున్నాం. అతను ఉద్యోగం కోసం హైదరాబాదు వచ్చాడు. ఈ లోపులో వేరే వాళ్ళతో నా పెళ్ళి నిశ్చయించారు. ఇంట్లో చెప్పకుండా అతని దగ్గరికి పారిపోయాను. అతనికోసం అంత రిస్క్ భరించి, అతని దగ్గర తప్పక చోటు దొరుకుతుందని ఆశించి ఆ సాహసం చేశాను. కాని ... కాని, నేను తప్పు చేశానని అతను నిందించాడు. నే నది సహించలేక పోయాను. ఆత్మాభిమానంతో అక్కణ్ణుంచి స్టేషన్‌కు వెళ్ళిపోయాను. రైలు కదులుతోంది. ఎక్కేశాను. నా మనస్సు శూన్యంగా ఉంది. ఏం చేస్తున్నానో, ఎక్కడికి వెళుతున్నానో నాకే తెలియదు. చేతిలో పైసా లేదు. అలా వాళ్ళ చేతుల్లో పడ్డాను. మీరు కలగజేసుకోకపోతే నిర్దాక్షిణ్యంగా వాళ్ళకి బలైపోదును.'

కంట తడి పెట్టుకుంది.

ఆమె కథ విన్నాక, ఆమె అంటే ఒక విధమైన అభిమానం, అంతకంటె ఆత్మీయతా ఏర్పడినాయి. ఆమెకు అందం ఉంది. చదువూ, సంస్కారం ఉన్నాయి. అంతకంటె ఏం కావాలి? ఆమెకు ఇష్టమైతే పెళ్ళిచేసుకోవా లనిపించింది.

'మీరు ఇంకా అతన్ని ప్రేమిస్తున్నారా?'

'ప్రేమా ... కాదు ... ద్వేషిస్తున్నాను.'

'మీరు మరోలా అనుకోకుంటే ఓ మాట అడగనా?'

'అడగండి.'

'నన్ను పెళ్ళిచేసుకోటానికి మీకు అభ్యంతరమా?'

ఆమె అభ్యంతరం చెప్పలేదు.

మా పెళ్ళయిన కొన్నాళ్ళకి ట్రాన్స్‌ఫర్ అయి హైదరాబాదు వచ్చేశాం. ఇక్కడికి వచ్చాక ఆమె పూర్తిగా మారిపోయింది. ఎప్పుడూ కులాసాగా ఉండేది కాదు. ఇల్లు విడిచి బయటికి వచ్చేది కాదు.

మా పక్క వాటాలో ఒక డాక్టరు ఉండేవాడు. అతనితో నాకు బాగా స్నేహమైంది. అతను తరుచు మా ఇంటికి వస్తూ సరదాగా నవ్విస్తూ ఉండేవాడు. అతని మాటలతో సేదతీరినట్లు నవ్వుతూ ఉండేది. ఆమె ఆనందంకోసమే అతన్ని తరుచు మా ఇంటికి ఆహ్వానిస్తూ ఉండేవాణ్ణి. వాళ్ళిద్దరికీ అక్రమ సంబంధం ఉందని గాని లేక ఇది చాలాకాలంనుంచీ ప్లాన్ వేస్తున్నారని గాని ఈ ఉత్తరం చూసేవరకూ నాకు తెలియదు."

చిన్న ఉత్తరం జేబులోంచి తీసి రామమూర్తి కిచ్చాడు.

"సురేష్ గారికి, నమస్కారం.

మీ మంచితనాన్ని ఈ విధంగా వంచిస్తున్నందుకు నాకు చాలా బాధగా ఉంది. కాని, ఎందుకో నేను మీతో సరిపెట్టుకోలే ననిపించింది. ఒక వ్యక్తి మీద ద్వేషంచేత, మిమ్మల్ని వంచిస్తున్నాననే జిజ్ఞాసనే కోర్కెలు అప్పుడా పని చేశాను తప్ప మిమ్మల్ని భర్తగా నే నెప్పుడూ చూడలేక పోయాను.

అప్పులుగా, మంచి మిత్రులుగా ఉండిపోతే ఎంత బాగుండేది! నిజం చెప్పాలంటే మీలాంటి ఉత్తమునికి నేను తగినదాన్ని. మీ భార్యగా నటించి వంచించలేను. ఇక నా విషయమంటారా? నేను ప్రేమించి జీవితాంతం సుఖపడాలనుకున్న వ్యక్తి నుంచి ఎప్పుడైతే దూరమైపోయానో అప్పుడే అన్నీ పోగొట్టుకున్నాను. నే నిప్పుడు కొత్తగా చెడిపోతున్నానని అన్న వంచన చేసుకోలేను. అయినా, శరీరానికి గాని మనస్సుకు మాలిన్యం లేదని నా నమ్మకం. నా మనస్సెప్పుడూ నేను ప్రేమించి ఆరాధిస్తున్న వ్యక్తినే అంటిపెట్టుకుని ఉంటుంది.

నాకోసం వృథాగా వెతికి శ్రమపడకండి. నే నిప్పుడు డాక్టర్ గారి భార్యగా అమెరికా వెళ్ళిపోతున్నాను. మీ రీ ఉత్తరం చదువుకునే సమయానికి బహుశః ఆసియా ఖండపు ఎల్లలు దాటిపోతానేమో!

ఇక సెలవు

ఎల్లప్పుడూ మీ శుభాన్ని కాంక్షిస్తూ,

—పార్వతి."

ఉత్తరం చేత్తో పట్టుకుని అలాగే ఉండిపోయాడు రామమూర్తి. ★

---

ఈ ఉగాది రాక్షస గానం చెయ్యదు!
ఈ గున్నమామిడిలోని కోయిలమ్మ దీనంగా
పాడదు
ఈ పేద బతుకుల కథ పెడచెవిని పెట్టదు
ఈ ఉగాది విర్లవానికి విలువ కట్టి
మార్చగలదు మానవ దృక్పథం.
ఈ ఉగాది నవరంగుల ఉషస్సుతో
ముంగిట నిల్పిం దీ ఉదయం,
ఈ ఉగాది ఆనందమయం కావాలని
కడుతూంది పచ్చని తోరణం.
ఈ కొత్త చిగురుల కొత్తదనంతో
కల కంటూంది యువ్వనం.
ఈ వేపపచ్చడిలోని కొత్తరుచి కోసం
వెతుకుతూంది యువతరం.
ఈ చేదులాంటి నిజాన్ని చెరుకురసం
తో కలిపి చింతలాంటి పులుపును
ఉప్పుతో విరిచి మధురమైన స
మ్మేళనంగా మార్చగలదు జీవితం.

# రాక్షసంలో ప్రభాతం

నింగి నున్న ధరలను భువికి దిగతార్చి
శాంతిని నెలకొల్పి వర్తమానం వ్యక్త
పరచి, చీకటిని తొలగించి
జీవనశోభను చేకూర్చి, విశ్వ
మానవ శాంతిని నెలకొల్పగలదని
ఆశిద్దాం!
ఈ ఉగాదితోని ప్రకృతి మాతతో
కలిసి నీవు వ్రాసే జిలిబిలి గీతికలతో
వెతుకుతున్నాను రేపటి సందేశం!
ఈ ఆశయాల పూతోటలో నిలిచి
పలుకుతున్నాను స్వాగతం! ★

—ఎమ్. సీతాలక్ష్మి